
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 7 మే 2024

గ్యారెంటీల అమలులో.. కాంగ్రెస్ విఫలం

» దేశం మొత్తం మోదీ వైపు చూస్తోంది » ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్‌దామి



సమావేశంలో ప్రసంగిస్తున్న పుష్కర్ సింగ్‌దామి

మహబూబ్‌నగర్,మే6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్‌దామి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి బీజేపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో మేధావుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పుష్కర్ సింగ్‌దామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని దుయ్యబట్టారు. రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 ఇలా ఏదీ నెరవేరలేదన్నారు. ఈ ఎన్నికలు మనదేశం కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసమని ప్రతీ ఇంటికి వెళ్లి చెప్పాలన్నారు. దేశ ప్రజలంతా మోదీ వైపు చూస్తున్నారని, మోదీ మూడోసారి ప్రధాన మంత్రి కాబోతున్నారని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహమూ లేదని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో నిజామాబాద్, మహబూబాబాద్, వరంగల్, సికింద్రాబాద్ వెళ్లానని, ఎక్కడికెళ్లినా ప్రజలు బీజేపీకి, మోదీ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. మోదీ హయాంలో అన్ని రంగాల్లో దేశం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. 2014కు ముందు ప్రపంచంలోనే భారతదేశం అవినీతిమయమైన దేశంగా చర్చించుకునే వారని, ఇప్పుడు భారత్ అందరికీ రోల్ మోడల్‌గా మారిందని చెప్పారు. అందుకు మోదీ కృషినే కారణమన్నారు. ప్రపంచంలో భారతదేశ పౌరులకు గౌరవం పెరిగిందని తెలిపారు. బీజేపీ పాలనలో రక్షణ రంగం బలోపేతమైందని, దేశ సైనికులు సరిహద్దులు దాటి శత్రువులకు తగిన గుణపాఠం చెబుతున్నారని గుర్తు చేశారు. ఎన్నో ఏళ్ల కలగా ఉన్న అయోధ్య శ్రీరామ మందిరానికి ప్రాణప్రతిష్ట చేశారని కొనియాడారు. కరోనా మహమ్మారితో ప్రపంచంలోని పెద్ద పెద్ద దేశాలు ఆర్థికంగా చతికిలపడినా మోదీ భారతదేశాన్ని ఆర్థికంగా నిలబెట్టారన్నారు. ఇదివరకు మనం ప్రపంచంలో పదో స్థానంలో ఉండే వాళ్లమని, ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా భారత్ వైపు చూస్తున్నారన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోయేందుకు అహర్నిశలూ మోదీ ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు స్వార్థ రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. పాలమూరులో డీకే అరుణను భారీ మెజారిటీతో గెలిపిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈనెల 10 నుంచి ఉత్తరఖండ్‌లో ఛార్‌దమ్ యాత్ర ప్రారంభం అవుతుందని, మీరంతా వచ్చి దర్శనం చేసుకోవాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో డీకె అరుణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, కె.రాములు, శ్రీవర్ధన్ రెడ్డి, అనంతరెడ్డి, డాక్టర్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధికార అహంకారం తలకెక్కింది

» రేవంత్ లక్కుకొద్ది ముఖ్యమంత్రి అయ్యారు

» నన్ను అవమానించేలా మాట్లాడితే మీ విలువనే దిగజారుతుంది: డీకే అరుణ



మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలే అయ్యిందని, అప్పుడే ముఖ్యమంత్రి రేవంత్‌కు అహంకారం తలకెక్కిపోయిందని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ ఆరోపించారు. అహంకారం పెరిగితే కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పడుతుందని అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుభవం లేదని, మంత్రి పదవి చేపట్టలేదని, ప్రజలకు ఏ రోజూ అందుబాటులో లేరని అన్నారు. వేరే పార్టీ నుంచి వచ్చినా ఆయనకు లక్కు ఉన్నందున ముఖ్యమంత్రి పదవి లాటరీలా తగిలిందన్నారు. షెడ్యూల్ విడుదలైన తరువాత ఏడు సార్లు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఆయన సభలు, సమావేశాలు నిర్వహించారన్నారు. వచ్చినప్పుడల్లా ఆయన ఇచ్చిన గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారు, జిల్లా అభివృద్ధికి ఏం చేస్తారో చెప్పకుండా డీకే అరుణను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. తాను త్యాగాల కుటుంబం నుంచి వచ్చానన్నారు. తనను అవమానపరిస్తే మీ విలువ రోజురోజుకు దిగజారుతుందన్నారు. బూతుమాటలు మాట్లాడే ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఉండటం సిగ్గుచేటన్నారు. మోదీని తిట్టడమంటే ఆకాశంపై ఉమ్మేయడం వంటిదేనని ఎద్దేవా చేశారు. అవినీతి స్కామ్‌లు, బ్లాక్ మెయిల్ దందాలు, ఓటుకు నోటు కేసులో జైలుకు పోయినోళ్లు మాట్లాడే ముందు సోయి ఉండాలని అన్నారు. తన రంగు ఏంటో, తన రక్తమేందో మాట్లాడతారని, అరుణమ్మది కల్తీ రక్తం అంటే దాని అర్థమేందో చెప్పాలన్నారు. పాలమూరు-రంగారెడ్డిపై ఇదివరకే తాను చాలెంజ్ చేశానని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలను కలిపి పాలమూరు రంగారెడ్డికి ఫేస్ 1 అని పేరు పెట్టి, ఏడు నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరందించేలా జూరాల నుంచి డిజైన్ చేసి, అడ్మినిస్ట్రేషన్ అనుమతులు ఇవ్వాలన్నారు. అప్పుడు తాను నరేంద్రమోదీతో మాట్లాడి నిధులు తెస్తానని రైతులకు మాటిస్తున్నానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి కల్వకుర్తి అసెంబ్లీకి ఎందుకు పోటీ చేయడం లేదంటే.. రెండున్నరేళ్లు కల్వకుర్తి ప్రజలకు దూరంగా ఉన్నందున పోటీ చేయడం ధర్మం కాదని ఓ ఇంటర్వ్యూలో చెప్పారన్నారు. మరి 2019 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి ఓడి పోయి ఐదేళ్లు కనిపించలేదని, ఇక్కడి ప్రజలకు దూరంగా ఉండి ఇప్పుడు పోటీ ఎలా చేస్తున్నారని నిలదీశారు. అంటే పాలమూరు ప్రజలు అంత అమాయకులా అని ప్రశ్నించారు. ఈనెల 10న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నారాయణపేటకు వచ్చే అవకాశం ఉన్నదని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్ త్వరలోనే ఖరారు కానుందని తెలిపారు. సమావేశంలో నాయకులు పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కె రాములు, పాండురంగారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.



కల్వకుర్తిలో కురుస్తున్న వర్షం

మండే

» నిప్పులు కురిపిస్తున్న భానుడు

» పానగల్‌లో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత

» వంగూరులో వడగళ్ల వాన

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల /వనపర్తి/వంగూరు అర్బన్, మే 6: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎండ ప్రతాపం చూపించగా, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి పట్టణంలో, వంగూరు మండలంలో మాత్రం వర్షం పడింది. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు తగ్గడం లేదు. నాలుగైదు రోజులుగా జిల్లాలో తీవ్రస్థాయిలో ఎండలు కాస్తున్నాయి. ఎండలకు తాళలేక జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల నుంచి కాలు బయటపెట్టాలంటేనే భయపడాల్సి వస్తోంది. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు వీయగా, అక్కడక్కడ చిరుజల్లులు కురిసినా సోమవారం మళ్లీ ఎండలు పెరగడంతో జనం ఇబ్బంది పడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో మోస్తరు వర్షం పడగా, వంగూరు మండలంలోని పోల్కంపల్లి, చౌదర్‌పల్లి, ఉల్పర గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో సోమవారం 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అమరచింత 44.7, కొత్తకోట, పెబ్బేర్, శ్రీరంగాపూర్ 44.0, వనపర్తి 43.8, ఘనపూర్, చిన్నంబావి 43.6, గోపాల్ పేట, 43.0, మదనాపూర్ 42.6, వీపనగండ్ల 42.5, రేవల్లి 42.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కల్వకుర్తిలో 45.1, బిజినేపల్లిలో 44.8, కోడేరులో 44.6, అచ్చంపేటలో 44.6, పెద్దకొత్తపల్లిలో 44.4, వంగూరులో 44.1, తాడూరులో 43.5, కొల్లాపూర్‌లో 43.5, బల్మూరులో 43.3, నాగర్‌కర్నూల్‌లో 42.3, పదరలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్‌లో 44.9, అయిజలో 44.8, వడ్డేపల్లిలో 44.7, గద్వాలలో 44.5, అలంపూర్‌లో 44.4, కేటీదొడ్డిలో 44.3, ఇటిక్యాలలో 43.8, రాజోలిలో 43.6, ఉండవెల్లిలో 42.7, మల్దకల్, మానవపాడులో 42.5, గట్టులో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో 44.6, అడ్డాకుల, చిన్నచింతకుంటలో 44.2, మూసాపేటలో 44.1, మిడ్జిల్, జడ్చర్లలో 43.5, మహబూబ్‌నగర్ రూరల్‌లో 43.4, నవాబ్‌పేటలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లా కోస్గి, మక్తల్, నర్వలో 43 డిగ్రీలు, కృష్ణలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఎన్నికలు బహిష్కరిస్తాం

» ఉమామహేశ్వర రిజర్వాయర్ భూ నిర్వాసితుల జేఏసీ



ఎన్నికైన నూతన జేఏసీ

బల్మూరు, మే 6: పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ఉమామహేశ్వర రిజర్వాయర్ భూ నిర్వాసితుల జేఏసీ అధ్యక్షుడు అనంత సీతారాంరెడ్డి చెప్పారు. అనంతవరం, బల్మూరు, మైలారం గ్రామాల రైతులు సోమవారం బల్మూరు గ్రామ పంచాయతీ ఆవరణలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీతారాంరెడ్డి మాట్లాడుతూ తమకు రిజర్వాయర్ వద్దని, తమ భూమి తమకు కావాలని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణం చేపడితే పోరాటం చేస్తామని చెప్పారు. రిజర్వాయర్ ద్వారా కాకుండా కాల్వల నుంచి గొలుసుకట్టు చెరువులకు నీళ్లు ఇవ్వాలన్నారు. వాటి నుంచి అనంతవరం, బల్మూరు, మైలారం గ్రామాలతోపాటు పలు గ్రామాలకు సాగు నీరు అందుతుందన్నారు. రిజర్వాయర్ నిర్మాణం చేపడితే దాదాపు 2,500 ఎకరాల నుంచి మూడు వేల ఎకరాల వరకు రైతులు భూములు పోయి, ఉపాధి కోల్పోతారన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మహేష్, రేణు, రాములు, జానకి రాములు, చంద్రమౌళి, తిరుపతయ్య, ఖదీర్, శివశంకర్‌తోపాటు మహిళలు, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక: ఉమామహేశ్వర రిజర్వాయర్ భూ నిర్వాసితుల జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనంత సీతారాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా పడాల తిరుపతయ్య, రాసమౌని మహేష్, బల్మూరు రేణు, ప్రధాన కార్యదర్శులుగా పరకాల రాములు, జానకి రాములు, తిరుపతయ్య చంద్రమౌళి, కొట్టె తిరుపతయ్య ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా సూరయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖదీర్, శివశంకర్, రమేష్, వెంకటస్వామి, కాగుల మల్లయ్య, పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

యువత ఓట్లే కీలకం

- వారిని ఆకర్షించేందుకు ప్రధాన పార్టీల యత్నాలు
- మైనార్టీల ఓట్లపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల గురి
- సాంప్రదాయ ఓటు బ్యాంకును ఆకర్షిస్తూనే మధ్య తరగతి, ఉద్యోగులు టార్గెట్‌గా బీజేపీ ప్రచారం

నాగర్‌కర్నూల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : యువ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన రాజకీయ పక్షాలు గురి పెట్టాయి. సామాజిక వర్గాల వారిగా అధికంగా ఉన్న ఓటర్లను ఆకర్షించి గెలుపు బాట పట్టేందుకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థులు విస్తృత ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. పోలింగ్ మరో వారం రోజుల్లో జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి, బీజేపీ నుంచి పోటీ చేస్తున్న భరత్‌ప్రసాద్, భారత రాష్ట్ర సమితి అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. గతంలో రెండుసార్లు నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించిన మల్లురవి ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని తాపత్రయ పడుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సోదరుడైన ఆయన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎలాగైనా గెలుపొంది తీరాలని భావిస్తున్నారు. జాతీయ రాజకీయాల నేపథ్యంలో ముస్లిం మైనార్టీలు, రైతులు, బీసీ సామాజిక వర్గాల నుంచి తనకు మద్దతు ఆశాజనకంగా ఉందని భావిస్తున్నారు. అయితే బీజేపీ కూడా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బలం పుంజుకోవడం భారత రాష్ట్ర సమితికి కొరకురాని కొయ్యగా మారింది. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి లక్షా 23వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు తనయుడు పి.భరత్ ప్రసాద్ బీజేపీ ఎంపీ టికెట్ దక్కించుకోవడం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఎంపీ రాములుకు కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల ప్రజలతో పార్టీలకతీతంగా సత్సంబంధాలు ఉండడం తమ పార్టీకి కలిసి వస్తుందని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. ఈ క్రమంలో యువతరం, మధ్య తరగతి, ఉద్యోగుల ఓట్లను తమ వైపు తిప్పుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంత ఓటర్లను ఆకర్షించేందుకు పార్లమెంట్ నియోజకవర్గంలో ఆ పార్టీ విస్తృత ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. పార్లమెంట్ నియోజకవర్గంలోని గద్వాల, అలంపూర్, వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో 17లక్షల 34వేల 773 ఓటర్లున్నారు. వీరిలో దాదాపు లక్ష పైచిలుకు ఓటర్లు యువకులు కొత్తగా ఓటు హక్కు వచ్చిన వాళ్లే ఉన్నారు. వారు మోదీ పట్ల ఆకర్షితులై ఉన్నారని భారతీయ జనతా పార్టీకి మరింత వారిని చేరువ చేయగలిగితే వారి కుటుంబాలు కూడా ఇచ్చే మద్దతుతో నాగర్‌కర్నూల్‌లో కాషాయ జెండాను ఎగురవేస్తామని బీజేపీ నేతలు ధీమాతో ఉన్నారు. ఉద్యోగ సంఘాలు, విశ్రాంత ఉద్యోగుల మద్దతును కూడగట్టుకునేందుకు కూడా భారతీయ జనతా పార్టీతో పాటు దాని అనుబంధ సంఘాలు శ్రమిస్తున్నాయి. ప్రత్యేకంగా మహిళల ఓట్లను రాబట్టేందుకు బీజేపీ త్రిముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. అయోధ్యలో రామాలయ నిర్మాణం, ఇంటింటికి బాలరాముని అక్షింతలు మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే మహిళలకు అమలు చేయబోయే వివిధ పథకాల గురించి ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు.

మరోవైపు పార్లమెంట్ నియోజకవర్గంలోని ఐదు అసెంబ్లీ స్థానాలను ఓడిపోయిన భారత రాష్ట్ర సమితికి ఈ పార్లమెంట్ ఎన్నికలు పరీక్షంగా మారాయి. జిల్లాలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలంటే తమ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మాజీ ఎమ్మెల్యేలపై పడింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అనూహ్యంగా బీఆర్ఎస్‌లో చేరి నాగర్‌కర్నూల్ టికెట్ తెచ్చుకోవడంతో ఆయన గెలుపు కారు పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది. బీజేపీ అభ్యర్థి భరత్, బీఆర్ఎస్ నుంచి రంగంలోకి దిగిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు మాదిగ సామాజిక వర్గం ఓట్లపైన ప్రధానంగా దృష్టి సారించారు. అయితే ఐదు నియోజకవర్గాల్లో ఓటమి చవి చూసిన బీఆర్ఎస్‌కు ఏ వర్గాలు మద్దతిస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోదీ ప్రభంజనంతో దూసుకెళ్తున్న బీజేపీలను దాటుకుని బీఆర్ఎస్ ఎంత వరకు నిలదొక్కుకుంటుందో వేచి చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో గతంలో కంటే బీజేపీ బలం పుంజుకోవడం భారత రాష్ట్ర సమితికి రాజకీయంగా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉత్పన్నమయ్యేలా చేస్తుందని అంచనాలు ఉన్నాయి.

మహిళలను లక్షాధికారులను చేస్తాం

» కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి



గంజిపేటలో ప్రచారానికి వచ్చిన మల్లు రవిని సన్మానిస్తున్న నాయకులు

గద్వాల, మే 6 : కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలను లక్షాధికారులను చేస్తుందని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. గద్వాల పట్టణంలోని గంజిపేటలో సోమవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మహిళలతో మాట్లాడారు. పేద మహిళలను గుర్తించి వారి ఖాతాల్లో లక్ష రూపాయలు వేస్తామని రాహుల్ గాంధీ ఎర్రవల్లి సభలో చెప్పారని గుర్తు చేశారు. ఇది ప్రపంచంలో ఎక్కడా లేని పథకమని వివరించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ. 2,500ను ఎన్నికల కోడ్ పూర్తి కాగానే వారి ఖాతాల్లో జమ చేస్తామని, రూ.500లకే సిలిండర్ ఇస్తామని తెలిపారు. ఉచిత విద్యుత్ కూడా అమలు చేస్తామని, అప్పటి వరకు ఎవరూ కరెంటు బిల్లులు చెల్లించొద్దని వివరించారు. ఎర్రవల్లి జన జాతర సభకు పట్టణం నుంచి భారీగా జన సమీకరణ చేసిన నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ నివాసంలో, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గంజిపేట శంకర్‌లతో ఆయన సమావేశమయ్యారు. పట్టణంలో ఇప్పటికే ప్రచారం ప్రారంభమైనా, పూర్తి స్థాయిలో నిర్వహించాలని చెప్పారు. గద్వాల పట్టణంలో కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీ సాధించాలని సూచించారు. పార్టీలో చేరికలను ప్రోత్సహించాలని సూచించారు. ఆ తర్వాత శంకర్ ఇంటికి వెళ్లి, అక్కడే టిఫిన్ చేశారు. ఎన్నికలపై ప్రచారంపై చర్చించుకున్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, నల్లారెడ్డి, రాజేంద్ర, శివరాజ్, వంశీ, చక్రపాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నిర్వాసిత రైతులు

గట్టు: మండల పరిధిలోని ముంపు గ్రామం చిన్నోనిపల్లి నిర్వాసిత ముంపు గ్రామస్థులు, రైతులు, మాజీ వార్డు సభ్యులు సోమవారం కాంగ్రెస్ నాయకుడు తిరుపతయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ తమను ఓట్ల కొరకు మాత్రమే వాడుకున్నదని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో మల్లు రవికి మద్దతు ఇస్తామని చెప్పారు.

గువ్వలను అడ్డుకున్న గ్రామస్థులు



మన్నెవారిపల్లిలో గువ్వల బాలరాజును అడ్డుకుంటున్న గ్రామస్థులు

అచ్చంపేట టౌన్, మే 6 : ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించి ఇవ్వలేదని నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును సోమవారం ప్రజలు అడ్డుకున్నారు. అచ్చంపేట మండల పరిధిలోని మన్నెవారిపల్లి, మార్లపాడు తండా పరిధిలో ఉన్న ఎస్ఎల్‌బీసీ ముంపు బాధితులకు మెరుగైన ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ అందిస్తామని 2018 ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని, మండల పరిధిలోని మన్నెవారిపల్లి గ్రామానికి సోమవారం ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును గ్రామస్థులు, యువకులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా సరైన హామీ ఇచ్చి ఎన్నికల కోసం తమ గ్రామానికి రావాలని యువకులు నినాదాలు చేశారు. గువ్వల బాలరాజు మాట్లాడుతూ గతంలో ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ గతంలో ఇచ్చామని, తాను రైతుల కోసం పోరాడిన వ్యక్తినని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని, మీకు తాను అండగా ఉంటానన్నారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనకారులను చెదరగొట్టడంతో గువ్వల బాలరాజు ప్రచారం చేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు.



తల్లి మరణంతో రోదిస్తున్న చిన్నారులు

కళ్ల ముందే తల్లి దుర్మరణం

» ఎర్రవల్లి వద్ద జాతీయ రహదారిపై ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

» బోరున విలపించిన నలుగురు చిన్నారులు » గతంలో తండ్రి మృతి

» ఇప్పుడు అమ్మ మరణంతో అనాథలైన పిల్లలు

ఎర్రవల్లి, మే 6: భర్త మృతితో ఆ మహిళ కాగితాలు ఏరుతూ నలుగురు పిల్లలను పోషించేది. సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ మహిళ కూడా మృతి చెందడంతో ఆమె పిల్లలు అనాథలయ్యారు. తల్లి మరణాన్ని తట్టుకోలేక వారు విలపించడం పలువురిని కలిచివేసింది. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తా వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాయచూర్ జిల్లా మల్లమద్ది గ్రామానికి చెందిన సుజాత(30) భర్త చనిపోయాడు. దాంతో ఆమె తన నలుగురు పిల్లలను పోషించేందుకు ఎర్రవల్లి మండలం జింకలపల్లి గ్రామానికి వచ్చింది. కాగితాలు ఎరుకూంటే జీవనం సాగించేది. రోజు మాదిరిగా సోమవారం కూడా కాగితాలను సేకరించి సంచుల్లో నింపుకుంది. తన పిల్లలను రోడ్డు అంచున ఉంచి, సంచులు వేసుకునేందుకు ఆటోను పిలిచేందుకు ఎర్రవల్లి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహం గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జు అయ్యింది. తల్లి మరణాన్ని తట్టుకోలేక పిల్లలు నరసింహ, లక్ష్మీ, రాజేశ్వరి, భారతి కన్నీరు మున్నీరుగా విలపించడం అక్కడున్న వారిని కలిచి వేసింది. పిల్లలందరి వయస్సు పదేళ్లలోపే ఉంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

మార్కెట్లో రైతు పరేషాన్

- ఎంఎస్‌పీ ఇవ్వని వ్యాపారులు
- ధాన్యం ఆరుబయటే.. వర్షమొస్తే బాధ్యులు ఎవరంటూ ఆవేదన


మార్కెట్‌లో ఆరుబయట ఆరబోసిన ధాన్యం

పాలమూరు, మే 6: మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మామూలు వరి రకం రూ.2183, సోనా రకం రూ.2203లు ఎంఎస్‌పీ (మినిమమ్ సపోర్ట్ ప్రైస్)ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కనీస ఆ ధరనైనా ఇవ్వకపోతే ఎట్లా అని రైతులు మదనపడుతున్నారు. వరి(హంస) గరిష్ఠం ధర రూ.1970, కనిష్ఠం ధర రూ.1970, సరాసరి ధర రూ.1970లకు 101 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. వరి సోనా రకం గరిష్ఠం ధర రూ.2484లు, కనిష్ఠం ధర రూ.2183, సరాసరి ధర రూ.2190లకు 1148క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. మార్కెట్‌లో సుమారు 117మంది లైసెన్స్‌దారులు (వ్యాపారులు) ఉన్నప్పటికీ కేవలం ప్రతీరోజు ధాన్యం కొనుగోలు చేసేందుకు పదిమంది లోపే రావటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం, పదిరోజుల క్రితం తీసుకువచ్చిన ధాన్యం ఆరబెట్టినప్పటికీ బాగా ఎండినా వ్యాపారులు ఆరుబయట పోసిన ధాన్యం కొనటానికి ఆసక్తి చూపటం లేదు. వర్షమొస్తే తమకు నష్టం వస్తుందనే సాకు చెబుతున్నారని రైతులకు ఆందోళన చెందుతున్నారు. అన్నింటిని కొనుగోలు చేయాల్సిందేనని మార్కెట్ అధికారులు చెప్పినా వ్యాపారులు ససేమిరా అనటంలో అంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.


షెడ్‌లో వేసిన లాట్‌ను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

వారం నుంచి మార్కెట్లోనే ఉన్నా



వారం క్రితం మార్కెట్‌కు ఏడు ట్రాక్టర్ల ధాన్యం తీసుకవచ్చిన్నా ధాన్యం పచ్చిగా ఉందని వ్యాపారులు చెబితే ఎండ బెట్టిన. అయినప్పటికీ ప్రభుత్వం చెప్పిన ధర వస్తుందో లేదో తెలియదు. ఉన్న పళంగా వర్షమొస్తే ధాన్యం తడవ కుండా అధికారులు టార్పాలిన్లు ఇచ్చారు. నష్టం వస్తే ఏమి చేయాలి.

- జి.గౌరయ్య, రైతు, పెద్దదర్పల్లి

ధాన్యం కింద పోసినందుకు కొనమంటున్నారు



వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు, అధికారులు తమకు న్యాయం చేయాలి. ధాన్యం కిందపోసినందుకు కొనుగోలు చేయడమంటున్నారు. ఇది ఎక్కడి అన్యాయం. షెడ్డు కింద స్థలం లేక ఇక్కడ వేస్తే ఇలా ఉంటున్నారు. ఎంఎస్‌పీ ధర ఇవ్వకపోవటం శోచనీయం.

- రాజు, ఉదండాపురం, జడ్చర్లమండలం

న్యాయం చేస్తాం

మార్కెట్‌కు వచ్చే రైతులకు న్యాయం చేయటమే మా బాధ్యత. వ్యాపారులు ప్రభుత్వం చెప్పిన ధరకు ధాన్యం కొనాలి. అలా కొనకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రతీ లాట్‌ను పరిశీలించి కొనాలి.

- శ్రీనివాస్, మార్కెట్ ఉన్నతశ్రేణికార్యదర్శి

దేశంలో ప్రధానిగా మోదీ అర్హుడు

- బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నమలై


కల్వకుర్తి శివాజీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై చిత్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, ఎంపీ రాములు, ఎల్లేని

కల్వకుర్తి, మే 6 : దేశంలో ప్రధాని పదవి అర్హత మోదీకే ఉందని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమి 400స్థానాల్లో విజయం సాధించి మూడవసారి మోదీ ప్రధాని అవుతారని బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నమలై అన్నారు. ఇండియా కూటమిలో ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితి ఉందన్నారు. నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా కల్వకుర్తి పట్టణంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ర్యాలీ, రోడ్‌షోకు ఆయనతో పాటు, ఎంపీ పోతుగంటి రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్ర సాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావులు హాజరయ్యారు. పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలోని మార్కెట్ రోడ్డు మీదుగా బీజేపీ ర్యాలీ శివాజీ చౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా అన్నమలై మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ బీ జేపీ ఎంపీ అభ్యర్థిగా భరత్‌ప్రసాద్‌ను ప్రధాని మోదీ ఎంపిక చేసి బరిలో నిలిపారని, ఆయన ను భారీ మెజా ర్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని పోతుగంటి భరత్‌ప్రసాద్ కోరారు. ప్రధాని మోడీ నాయకత్వంలోని బీజేపీతోనే అభివృద్ధి సాధ్య మని పోతుగంటి రాములు, తల్లోజు ఆచారిలు అన్నారు. నాయకులు శేఖర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, కృష్ణగౌడ్, నరసింహ, రాఘవేందర్‌గౌడ్ తదితరులున్నారు.

పీఈటీల ఉన్నతీకరణ సమస్యను పరిష్కరించాలి

- టీజీపీఈటీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్


సమావేశంలో మాట్లాడుతున్న దూమర్ల నిరంజన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 6 : వ్యాయామ విద్య ఉపాధ్యాయుల ఉన్నతీకరణ సమస్య ను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సం ఘం(తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూ మర్ల నిరంజన్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సంఘం జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యాయామ విద్య ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఉన్నతీకరణ అంశాన్ని పార్లమెంటు ఎన్నికలు ము గిసిన వెంటనే పరిష్కరించాలన్నారు. టెట్‌కు సంబంధించి జాతీయ ఉపాధ్యాయ మండలి పంపిన పూర్తిస్థాయి వివరణ రాష్ట్ర పాఠశాల విద్యా కమిషన్ వెల్లడి చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఒకనెల గ్రాఫ్ శాలరీ అందేవిధంగా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు సూర్యప్రకాష్, మొగులాల్, ఆనంద్‌కుమార్, శంకర్‌నాయక్, సు చేతన్‌రెడ్డి, మోయిన్, రాములు, శ్రీనివాసులు, రాజు, అంజమ్మ పాల్గొన్నారు.

హెలిప్యాడ్ స్థలం పరిశీలన


హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట వైద్య విభాగం, మే 6 : ఈ నెల 10న నారాయణ పేట జిల్లా కేంద్రానికి ప్రధా న మంత్రి నరేంద్ర మోదీ రానుండటం తో సోమవారం సాయంత్రం పట్టణంలోని యాద్గీర్ రోడ్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో హెలిప్యాడ్ దిగడానికి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రతంగ్‌పాండురెడ్డి, రఘురామయ్యగౌడ్, లక్ష్మీ శ్యామ్‌సుందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కే మూర్తి

వనపర్తి అర్బన్, మే 6: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఐదు ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ రక్షిత కే మూర్తి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా మండలాల ఎస్సైలను ఆదేశించారు. మూడు భూ ఫిర్యాదులు, ఒకటి పరస్పరం గొడవలకు సంబంధించి, మరొకటి భార్యభర్తల తగాదాలకు సంబంధించి ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

కారు, బైకు ఢీకొని ఒకరి మృతి

నర్వ, మే 6: కారు, బైకు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా నర్వ మండల పరిధిలోని యాంకి, నాగిరెడ్డిపల్లె గ్రామాల మధ్య సోమవారం చోటు చేసుకున్నది. ఎస్సై కుర్మయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. మక్తల్ మండలం మంతన్‌గోడ్ గ్రామానికి చెందిన శివ (23) అనే యువకుడు అమరచింత నుంచి నర్వ వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా నర్వ నుంచి అమరచింత వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నది. దాంతో బైక్‌పై ఉన్న శివ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న వారు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. శవాన్ని అంబులెన్స్‌లో ఆత్మకూర్ ఆసుపత్రికి తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


వివరాలను తెలుసుకుంటున్న ఎస్ఐ శ్రీనివాస్


రామాంజనేయులు (ఫైల్)

గద్వాల క్రైం, మే 6 : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గద్వాల పట్టణంలో చోటు చేసుకున్నది. అయితే తన భర్త మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల పట్టణంలోని మూడవవార్డు కాలనీకి చెందిన పోగుల రామాంజనేయులు గద్వాలలో హమాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో ఆదివారం హమాలీ పనులు ముగించుకున్న తర్వాత కొందరి వ్యక్తులతో కలిసి మార్కెట్ యార్డ్ సమీపంలో మద్యం తాగాడు. అయితే, రాత్రికి మార్కెట్ యార్డులోని నిర్మానుష్య ప్రదేశంలో శవమై కనిపించాడు. అయితే, మద్యం తాగిన చోటు కాకుండా మరోచోట శవమై కనిపించడంతో మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య పద్మ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో కేసు నమోదు చేసుకొని పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ జిల్లా ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి మృతికి సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. పోస్టుమార్టం నివేదికలో పూర్తి వివరాలు తెలుస్తాయని బాధితురాలికి ఎస్సై తెలిపారు.

భర్తపై గొడ్డలితో భార్య దాడి

- గ్రామస్థులు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి


నాగయ్య (ఫైల్)

బిజినేపల్లి, మే 6 : భార్య గొడ్డలితో దాడి చేయగా భర్త చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూ ల్ జిల్లా బిజినేపల్లి మండలం మమ్మా యిపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివ రాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మి, నక్క నాగయ్య(42) భార్యాభర్తలు. ఇద్దరు మద్యానికి బానిసల య్యారు. తాగిన మైకంలో నిత్యం తగువ ప డుతుండే వారు. అయితే సోమవారం భార్యా భర్తలు గొడవ పడ్డారు. దాంతో తాగిన మైకంలో క్షణికావేశానికి గురైన లక్ష్మి గొడ్డలితో నాగయ్య మొహంపై, మెడ పై దాడి చేసింది. రక్త మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గ్రామస్థులు వెంటనే 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేశఖర్ రెడ్డి తెలిపారు. బాధితుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

పట్ట పగలు ఇంట్లో చోరీ

- బంగారు, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు


ఫింగర్ ప్రింట్ నమూనాల సేకరిస్తున్న పోలీసులు

పెబ్బేరు, మే6 : పెబ్బేరు మండల కేంద్రంలో పట్టపగలు ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. అది ఎక్కడో కాదు పోలీస్ స్టేషన్ వెనకాల పట్టపగలు చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బోయ రామ కృష్ణ అనే వ్యక్తి కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా అతను ఉదయం 9.30కి ఇంటికి తాళం వేసి వ్యాపారం నిమిత్తం షాప్‌కు వెళ్లి తిరిగి రెండున్నర గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 19 తులాల బంగారం, రూ. 1,60,000 నగదు గుర్తు తెలియని దొంగలు దోచుకెళ్లారు. దాంతో బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. దొంగతనం జరిగిన ప్రదేశంలో ఫింగర్ ప్రింట్‌ను సేకరించినట్లు పోలీసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే వాహనం తనిఖీ


బలీద్‌పల్లి స్టేజీ దగ్గర మాజీ ఎమ్మెల్యే ఆల వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

అడ్డాకుల, మే 6: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వాహనాన్ని ఎన్నికల అధికారులు, పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలానికి మాజీ ఎమ్మెల్యే ఆల ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా అడ్డాకుల మండల పరిధిలోని బలీద్‌పల్లి స్టేజీ దగ్గర పోలీసులు వాహనాన్ని నిలిపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆల పోలీసులకు పూర్తిగా సహకరించారు. అనంతరం ఆయన చిన్నచింతకుంట మండలానికి వెళ్లిపోయారు.

కాంగ్రెస్ పాలనలో దివ్యాంగులకు సంక్షేమం

- తెలంగాణ వికలాంగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నారా నాగేశ్వర్‌రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నారా నాగేశ్వర్‌రావు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 6: కాంగ్రెస్ పాలనలోనే దివ్యాంగులకు అనేక సంక్షేమ పథకాలు అందుతాయని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నారా నాగేశ్వరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగుల సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా ఉండగా ఉంటూ వస్తున్న నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి మల్లు రవికే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో దివ్యాంగుల జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వికలాంగులను దివ్యాంగులుగా నామకరణం చేసి వారి సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వికలాంగులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, ప్రమోషన్లు హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం, సాధికారత కోసం అనేక అంశాలు జాతీయ మేనిఫెస్టోలో చేర్చిందన్నారు. మల్లు రవికి అండగా నిలిచి తమ వంతు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు నాగభూషణం, భీంసాగర్, జి.రాము, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆధునికీకరణకు

ప్రత్యేక కార్యాచరణ

» పనులు చేపట్టేందుకు 298 పాఠశాలల గుర్తింపు » 115 చోట్ల ప్రారంభమైన పనులు


గద్వాల మండలం ఈడిగోనిపల్లి పాఠశాల వద్ద మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అమ్మ కమిటీ సభ్యులు

గద్వాల టౌన్, మే 6 : ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, మరమ్మతు పనులకు విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు - మన బడి', 'మన బస్తీ - మన బడి' పేరుతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించి, ఆధునికీకరించేందుకు సిద్ధమయ్యారు. అందుకోసం జిల్లాలోని 161 పాఠశాలలను ఎంపిక చేసి, పనులు చేపట్టారు. వాటిలో 15 పాఠశాలలను మాత్రమే అధికారికంగా ప్రారంభించారు. మరో 33 చోట్ల పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలిన పాఠశాలల్లో పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా బడుల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. అందులో ప్రధానంగా పాఠశాల భవనాలకు మరమ్మతులు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయల కల్పన పనులను చేపట్టనున్నారు. అందుకు రూ.8 కోట్లకు పైగా వ్యయం కానున్నదని అధికారులు అంచనా వేశారు.

సెలవుల్లోగా పనుల పూర్తికి చర్యలు



వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అమ్మ ఆదర్శ కమిటీలకు పనుల నిర్వహణ బాధ్యతను అప్పగించాము. ఇప్పటికే కలెక్టర్ ఆదేశం మేరకు అన్ని పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేశాం. పనులను చేపట్టి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, సమీక్షించేందుకు అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చాం.

- ఎం.ఇందిర, జిల్లా విద్యాశాఖ అధికారి

పాఠశాలల ఎంపిక - పనులకు శ్రీకారం

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో మొత్తం 474 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇప్పటికే అన్ని బడుల్లో 15 మంది సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 298 పాఠశాలల్లో అత్యవసర మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. వాటిలో 267 పాఠశాలలు గ్రామీణ ప్రాంతాలకు చెందినవి కాగా, వాటిలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల పరిధిలో మరో 31 పాఠశాలలను గుర్తించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టే మరమ్మతు పనులు మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టనున్నారు. ఈ పనుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1.9 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం జిల్లాలోని 115 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. త్వరలోనే మిగిలిన పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులను విద్యా సంవత్సరం ఆరంభంలోగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రపంచ స్థాయి గుర్తింపు

-రత్నగిరి ఫౌండేషన్ సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి


బాస్కెట్ బాల్ క్రీడాకారులతో ముచ్చటిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రంలో రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ

కొల్లాపూర్, మే 6 : క్రీడల్లో ప్రతిభ చాటితే ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కుతుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్‌కన్వీనర్ కేతూరి ధర్మతేజ ఆధ్వర్యంలో విద్యార్థులకు, యువతీ యువకులకు, మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన సమ్మర్ క్యాంపును మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి బాస్కెట్‌బాల్, వాలీబాల్, షటిల్ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని క్రీడల్లో రాణిస్తే ప్రపంచ స్థాయి గుర్తింపుతోపాటు దేశానికి, రాష్ట్రానికి, పుట్టిన ఊరుకు గొప్ప పేరు తెచ్చిన వారవుతారని జూపల్లి పేర్కొన్నారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపును సద్వినియోగపర్చుకుని విద్యార్థులు, యువత అన్ని రకాల క్రీడల్లో మెళకువలు నేర్చుకుని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక క్రీడాకారులకు ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చిన తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని కొల్లాపూర్‌లో ఆక్రమణకు గురైన ప్రదేశాన్ని స్వాధీనపర్చుకుని క్రీడాకారుల కోసం మినీ స్టేడియం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అనంతరం సమ్మర్ క్యాంపునకు హాజరైన విద్యార్థులను, యువతను, క్రీడాకారులతో మంత్రి జూపల్లి ముచ్చటించారు. నెలరోజుల పాటు కొనసాగే సమ్మర్ క్యాంపులో అన్ని రకాల క్రీడల్లో విద్యార్థులకు మెళకువలు నేర్పాలని ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, ట్రైనర్ మక్బుల్ అహ్మద్‌కు మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహెము దా బేగం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంతు నాయక్, మాజీ సర్పంచ్ నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి.ఎక్బాల్, కాంగ్రెస్ నాయకులు బొరెల్లి మహేష్, ఖాదర్‌పాష, పసుల వెంకటేశ్, తాహేర్‌పాష, గోవిందునాయక్, శంకర్‌నాయక్, వాసు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నందిన్నె చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

కేటీదొడ్డి, మే 6: ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును తీసుకెళ్తున్న ఓ వ్యక్తి నుంచి పోలీసులు తనిఖీ చేసి నగదును పట్టుకున్నారు. సోమవారం కర్ణాటకలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన రంగప్ప అనే వ్యక్తి గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో నందిన్నె వైపు రూ.రెండు లక్షలు తీసుకువస్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో రిజర్వుడ్ ఏఎస్సై మహేష్, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ నాయక్, ఎస్ఎస్‌టీం హన్మంతురెడ్డి, ఎక్సైజ్ కానిస్టేబుల్ జగదీష్ కుమార్, వసురాం నాయక్, ప్రేమ్‌రెడ్డి ఉన్నారు.

లిక్కర్ పట్టివేత- కేసు నమోదు


పోలీసులు స్వాధీనం చేసుకున్న లిక్కర్ బాటిళ్లు

బాలానగర్, మే 6: బాలానగర్ మండలంలోని జుడిగుట్ట గ్రామ పంచాయతీకి చెందిన రేతావత్ కిషన్ బెల్ట్ షాపు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తుండగా పోలీసులు సోమవారం దాడులు చేశారు. కిషన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపాజీ వెల్లడించారు. గ్రా మాల్లో, తండాలలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

పెద్దపల్లిలో..

తెలకపల్లి : మండలంలోని పెద్దపల్లికి చెందిన పుద్దపుల్ల బాబు కిరాణం షాపుపై సోమవారం తెలకపల్లి పోలీసులు ఆకస్మికంగా దాడి 9.8 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ. 10,80 ఉం టుందని ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

'నిందితులపై చర్యలు తీసుకోవాలి'

హన్వాడ, మే 6: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని అత్యకుంటతండాలో బీఆర్ఎస్ జెండా రాడ్డును గుర్తు తెలియని వ్యక్తులు విరుగగొట్టారు. సోమవారం ఎంపీపీ బాలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కరణకర్‌గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు కొండ లక్ష్మయ్య జెండా రాడ్డును పరిశీలించారు. తండాలో గుర్తు తెలియని వ్యక్తులు ఇలాంటి పనికి పూనుకున్నారని వారిని గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కొండ లక్ష్మయ్య తెలిపారు.కార్యక్రమంలో ఎస్‌టీ సెల్ మండల అధ్యక్షుడు హరిచందర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నరేందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ జంబులయ్య తదితరులు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

మిడ్జిల్, మే 6: ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్‌జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. సోమవారం ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ (26) అనే యువకుడు పెయింటర్ పనిచేసేవాడు. రోజూ మాదిరిగానే పనికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ చౌరస్తాలో సిగ్నల్‌గడ్డ నుంచి చౌరస్తా వైపు వెళ్తుండగా మరో బైక్ వచ్చి ఢీకొన్నది. దాంతో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో జిల్లా అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వైద్యం వికటించి రోగి మృతి

నాగర్‌కర్నూల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన వ్యక్తి వైద్యం వికటించి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన రాములు(38) అనే వ్యక్తి సోమవారం జ్వరం వచ్చి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. పరిస్థితి విషమించడంతో డాక్టర్ ఆ వ్యక్తిని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశాడు. అతడు నాగర్‌కర్నూల్‌కు వెళ్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఈ సంఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

దాడి ఘటనలో పలువురిపై కేసు

ఊర్కొండ, మే 6: దాడి చేసిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన జెల్ల శివ కల్వకుర్తి మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన పూజతో గత నెలలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. దాంతో పూజ కుటుంబ సభ్యులు సోమవారం రాచాలపల్లి గ్రామానికి చేరుకొని ఇంట్లో ఉన్న శివ కుటుంబ సభ్యులతో పాటు పూజపై దాడి చేసి కులం పేరుతో దూషించారు. దాంతో పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇరువురికి రిమాండ్

అచ్చంపేటటౌన్, మే 5: డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ కోట్ల జనార్దన్‌పై దాడి చేసిన ఘటనలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27న అచ్చంపేట పట్టణంలోని లింగాల చౌరస్తాలో ఆర్టీసీ బస్సుకు అడ్డుగా ఉన్న ఆటోను తీయాలని డ్రైవర్ కోరారు. దాంతో ఆటో డ్రైవర్ హనుమంతు, ఆటోలో ఉన్న మహిళలు ఇద్దరు కలిసి ఆర్టీసీ డ్రైవర్‌ను దుర్భాషలాడారు. చెప్పుతో దాడిచేసి బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. ఆర్టీసి డ్రైవర్ జనార్దన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సస్పెన్షన్

గద్వాల, మే 6: ఎన్నికల విధుల్లో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీఎం సంతోష్ సస్పెండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన ఈవీఎంల ర్యాండమైజేషన్‌లో కావాల్సిన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచకపోవడం, ఎన్నికల కమిషన్ ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ గద్వాల మండల రెవెన్యూ కార్యాలయంలో డీటీ (ఎలక్షన్)గా పని చేస్తున్నారు.

చికిత్స పొందుతూ పలువురి మృతి

మిడ్జిల్/నాగర్‌కర్నూల్ క్రైం/గోపాల్‌పేట, మే 6: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని చిట్టిబోయిన్‌పల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఎన్ హెచ్44 రోడ్డులో భూత్పుర్ వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొన్నది. ఆటోలో ప్రయాణిస్తున్న అంగోతు అన్లీ, పద్మ, శ్రీనులకు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై చంద్రమోహన్‌రావు సోమవారం తెలిపారు. గాయాలు అయిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం అన్లీ(60) మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలంలోని గన్యాగుల గ్రామానికి చెందిన బోనమోని మల్లయ్య, జంగిడి మల్లయ్యలు ఇద్దరి మధ్య వ్యవసాయ పొలం దగ్గర బాట పంచాయితీ నడుస్తోంది. ఆదివారం గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ పంచాయితీ నిర్వహించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో జంగిడి మల్లయ్య కుమారుడు బాలరాజు, భార్య శ్యామలమ్మ ఇద్దరు కలిసి బోనమోని మల్లయ్య రోడ్డు వెంట పోతుండగా ఇటుకలతో దాడి చేశారు. ఈ సంఘటనలో బోనమోని మల్లయ్య తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేయగా మార్గంమధ్యలో బోనమోని మల్లయ్య మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు జంగిడి మల్లయ్య, జంగిడి శ్యామలమ్మ, జంగిడి బాలరాజు, జంగిడి రవిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన గోపాల్‌పేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోలికెపాడ్ గ్రామ పరిధిలో ఉన్న జింకలబీడు తండాకు చెందిన ఆంబోతు శ్రీను(38) మేస్త్రీ పని చేసుకుంటూ హైదరాబాద్‌లో జీవనం చేసేవాడు. గత నెల 21న తన చెల్లి పెళ్లికి స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 1న గోపాల్‌పేటకు వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొన్నది. దీంతో శ్రీను తలకు బలమైన గాయం అయింది. చికిత్స కోసమని వనపర్తి ఏరియా ఆసుప్రతికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. శ్రీను తమ్ముడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కేజీబీవీ భవన నిర్మాణ పనుల్లో జాప్యం

- ఊర్కొండలో నాలుగేళ్ల క్రితం పనులకు శంకుస్థాపన
- రెండు స్లాబ్‌లు వేసి మధ్యలో వదిలేసిన గుత్తేదారుడు
- స్థానిక ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని ప్రజల విజ్ఞప్తి


ఊర్కొండలో అసంపూర్తిగా ఉన్న కస్తూర్బా విద్యాలయ భవన నిర్మాణం

ఊర్కొండ, మే 6: ఊర్కొండ మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనుల్లో జాప్యం కొనసాగుతుంది. ఇరుకు గదులతో విద్యార్థులు సతమతమవుతుంటే విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని కస్తూర్బా పాఠశాల భవనం నిర్మాణం కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే గుత్తేదారుల ఆలసత్వంతో మధ్యలోనే నిర్మాణ పనులు ఆగిపోయాయి. మండల కేంద్రంలో గత రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా బాలికల విద్యాలయం ఆరు నుంచి 10 తరగతులకు అనుమతులు ఇచ్చింది. దాంతో మండలంలో ఎక్కడ అనువైన భవనం లేకపోవడంతో కల్వకుర్తి పట్టణంలో ఇరుకైన అద్దె భవనంలో విద్యాలయం కొనసాగుతున్నది. ఇరుకైన గదుల్లో తరగతులు నిర్వహించడంతో పాటు అందులోనే రాత్రి సమయాల్లో నిద్రకు ఉపక్రమించడం, మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో నూతన కస్తూర్బా విద్యాలయం భవన నిర్మాణం చేపట్టడానికి రెండు ఎకరాల భూమిని గత ప్రభుత్వం కేటాయించడంతో పాటు రూ.3.50కోట్ల నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరు కావడంతో అప్పటి ఎమ్మెల్యే డా.సి.లక్ష్మారెడ్డి భవనం నిర్మాణం కోసం నాలుగు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారుడికి ఆదేశించారు. కస్తూర్బా భవనం నిర్మాణం కోసం టెండరులో గుత్తేదారుడు తీసుకొని అనంతరం సబ్-గుత్తేదారుడికి ఇవ్వడంతో సమస్య తలెత్తింది. కాంట్రాక్ట్ తీసుకున్న గుత్తేదారుడు పనులు చేయకుం డా సబ్ గుత్తేదారుడికి ఇవ్వడంతో పనులు నత్తనడకన కొనసాగాయి. ఆరు నెలల క్రితం వరకు అప్పుడప్పుడు పనులు చేస్తూ రెండంతస్థులు స్లాబ్ వేసి వదిలేశారు. బిల్లులు వచ్చిన అసలు గుత్తేదారుడు తీసుకొని తనకు ఇవ్వడంలేదని మరో గుత్తేదారుడు పనులు నిలిపివేశారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. నిలిచిపోయిన కస్తూర్బా విద్యాలయం పనులు త్వరితగతిన పూర్తి అయ్యేవిధంగా స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా పనుల్లో జాప్యం జరుగడంతో ప్రస్తుత ప్రభుత్వమైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మాణం పనులు వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

టెండరు రద్దు చేశాము

కస్తూర్బా విద్యాలయం భవనం నిర్మాణం పనులు చేపట్టడానికి టెండరు తీసుకున్న గుత్తేదారుడు పనులు త్వరగా పూర్తి చేయకపోవడంతో టెండరు రద్దు చేశాము. తిరిగి టెండర్లు ఆహ్వానించాం. ఎన్నికల కోడ్ అడ్డురావడంతో నిలిచిపోయింది.

- మహ్మద్ హుస్సేన్, ఏఈ, ఊర్కొండ

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కల్వకుర్తి, మే 6 : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ కోరారు. కల్వకుర్తి పట్టణంలోని పీబీఎం కళాశాలలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ, పీవో, ఏపీవోల శిక్షణను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లో చేపట్టిన కమిషనింగ్ ప్రక్రియ పరిశీలించడం జరిగిందని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లలో బ్యాలెట్ పేపర్లు, అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను, అమరుస్తున్న తీరును పరిశీలించారు. ఈ నెల 13న జరగనున్న పోలింగ్ కోసం ఈవీఎంలను అన్ని విధాలా సరి చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. పీవో, ఏపీవోలకు పలు రకాల సూచనలు, సలహాలు అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఎస్.శ్రీను, పలువురు అధికారులు ఉన్నారు.

మాదిగల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

కల్వకుర్తి, మే 6 : కల్వకుర్తి పట్టణంలో ఈ నెల 8న నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మబ్బు సాయన్న మాదిగ, ముక్కిడి కృష్ణ, నేరటి మల్లేష్‌లు తెలిపారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగల్లో రాజకీయ చైతన్యాన్ని నింపి జాతి కోసం పని చేసే వారినే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించుకో వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మాదిగలకు మోసపూరిత మాటలు చెప్పి ఓట్లు వేయించుకుందని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 3 లక్షల 75వేల ఓట్లు మాదిగలవి ఉన్నాయని, అయినా టికెట్ మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదని విమర్శించారు. ఈ నెల 8న జరిగే మాదిగల ఆత్మగౌరవ సభకు పార్టీలకతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని మబ్బుసాయన్న మాదిగ, ముక్కిడి కృష్ణ, నేరటి మల్లేష్‌లు పిలుపునిచ్చారు. జోగి విష్ణు, శ్రీశైలం, పరుశరాములు, మహేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఉద్యోగిని సన్మానిస్తున్న జిల్లా వైద్య అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్

వంగూరు, మే 6: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ అన్నారు. సోమవారం వంగూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 10 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగాలు పొందిన సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య అధికారి సుధాకర్ లాల్, జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకట్‌దాస్‌లు హాజరయ్యారు. ఉద్యోగులను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. భీమానాయక్, శ్రుతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వాగ్దానాల్లో ఒక్కటి కూడా అమలు కాలేదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కోడేరు, మే 6 : బీజేపీ గతంలో ఇచ్చిన వాగ్దానాల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాయడంతో పాటు పౌరహక్కులను అణచివేస్తుందని మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేసి రాజకీయాలను మతంతో కలుషితం చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశానికి కోడేరు మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, రాజాపూర్, మాచుపల్లి, సింగాయిపల్లి తదితర గ్రామాల పార్టీ కార్యకర్తలతో పాటు సానుభూతిపరులు, సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ, మండల కమిటీ సభ్యులు రమేష్, ఈశ్వర్, మరాటి వెంకటయ్య, ఎండి.మాలిక్, ఆయా గ్రామాల కార్యదర్శులు శివశంకర్, వీరప్రసాద్, వి.రాజేష్, సీనియర్ నాయకులు వి.లక్ష్మయ్య, ఎస్.నరసింహ, బాలయ్య, కార్తీక్ తదతరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్తాం

కొల్లాపూర్: ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు ద్వారా బుద్ధి చెప్తామని ఆ దిశగా ప్రజలను చైతన్యం చేస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు పేర్కొన్నారు. సోమవారం కొల్లాపూర్ మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో ఎండి.సలీం అధ్యక్షతన కొనసాగిన నియోజకవర్గ స్థాయి సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో సీపీఎం నాయకులను, కార్యకర్తలనుద్దేశించి వర్ధం పర్వతాలు మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి మల్లు రవిని గెలిపిద్దామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మతరాజ్యం వద్దు ప్రజాస్వామ్యమే హద్దు అనే నినాదంతో బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలని బుక్‌లెట్‌ను విడుదల చేశారు. సీపీఎం మండలకార్యదర్శి బి.శివవర్మ, బాలపీరు, తేజానాయక్, సురేందర్, సాయిప్రకాశ్, బాషసత్యం, కార్తీక్,సంజీవ్ పాల్గొన్నారు.

గతంలో ఎలాంటి సంక్షేమ ఫలాలు అందలేదు

- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకటాచారి



సమావేశంలో మాట్లాడుతున్న లాల్‌కోట వెంకటాచారి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 6: గత ప్రభుత్వంలో విశ్వకర్మలకు ఎలాంటి సంక్షేమ ఫలాలు అందలేదని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటాచారి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజారిటీతో గెలిపిద్దామని ఆయన పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంక్షేమ సంఘం భవన్‌లో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరిన వెంటనే విశ్వకర్మల కార్పొరేషన్‌కు పాలక మండలి నియమించి రూ.500 కోట్లు నిధులతో సబ్సిడీ రుణాలు ఇవ్వడానికి సూత్ర ప్రాయంగా అంగీకరించిందని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మల్లు రవికి విశ్వకర్మలంతా అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు వీరోజు చంద్రమౌళి, తర్వాని పాండుచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రోజు రవీంద్రాచారి, నాయకులు రమాకాంత్, మన్యంచారి, కేశవాచారి, సింహాచలం, గోపిచారి, ధర్మచారి, సరేందర్‌చారి, సుగుణాచారి, వీరసత్యం, దక్షిణమూర్తి, అశోక్‌చారి, శేఖరాచారి, రవిచారి తదితరులు పాల్గొన్నారు.

రాచాలపల్లిలో బీఆర్ఎస్ ప్రచారం

ఊర్కొండ, మే 6: తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ని గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గిరి నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని రాచాలపల్లిలో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, అమరేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

లింగాల, మే 6: మండల పరిధిలోని రాయవరం గ్రామ పంచాయతీకి చెందిన 40 మంది వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. పార్టీ పటిష్టతకు కృషి చేసేవారిని పార్టీ గుర్తిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మాజీ సర్పంచు మల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, మే 6: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు రూ. 500 సిలిండర్ అందజేస్తున్న ప్రభుత్వం మాది అన్నారు. రాబోవు రోజుల్లో ప్రతీ నియోజకవర్గంలో 3వేలకు పైగా ఇందరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. సీనియర్ నాయకులు మోపతయ్య, మల్లేష్, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేటటౌన్, మే 6: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని బక్కలింగాయపల్లి, బండతండా, అక్కారం గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమలు చేస్తానన్న హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి వ్యతిరేకమే బీజేపీ విధానం

- టీపీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్



మాట్లాడుతున్న టీపీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్

కల్వకుర్తి, మే 6 : సామాజిక న్యాయం అమలుపర్చడం బీజేపీ విధానమే కాదని పేదల రిజర్వేషన్లు తగ్గించి అగ్రకులాలకు పెంచడానికే కుట్ర జరుగుతుందని టీపీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కల్వకుర్తి పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లతో కలిసి విలేకర్ల సమావేశంలో బెల్లయ్యనాయక్ మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పాలనలో విఫలమైందని విమర్శించారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలుపర్చలేదని విమర్శించారు. ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగ స మస్య జఠిలంగా మారిందని, లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పి రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకుంటుందని పేర్కొన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో 22 కోట్ల మంది మధ్య తరగతి ప్రజలు పేదలుగా మారారని విమర్శించారు. ఇండియా కూటమి మెజార్టీ స్థానాల ను కైవసం చేసుకుని ప్రధాన మంత్రి పదవిని రాహుల్ చేపట్టబోతున్నారని జోస్యం చెప్పారు.

ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ఐదు న్యాయాలను, 25గ్యారంటీలను అమలుపరుస్తామని బెల్లయ్యనాయక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పేదోడికి మాత్రమే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అణచివేతలకు గురవుతున్న కులాలకు రిజర్వేషన్లు ఇవ్వడం జరుగుతుందని వాటిని బీజేపీ మతాలు, కులాలను తగ్గించాలని ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈబీసీ కోటాలో అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్లు కేటాయించారని దీంతో ఏ వర్గాలు ప్రయోజనం చెందుతాయో చెప్పాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే ఎలాంటి ప్రయోజనం లేదని ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని బలపర్చి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని బెల్లయ్యనాయక్ పిలుపునిచ్చారు. గిరిజన సంఘం నాయకులు రఘునాయక్, లింగంనాయక్, రమేష్‌నాయక్, హనుమానాయక్, చందునాయక్, గోపి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఏపీ మల్లయ్య, వెంకటేష్, సురేష్ ఉన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట, మే 6 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మల్లు రవిని అధిక మెజార్టీతో గెలిపించడం కోసం కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి పిలుపునిచ్చారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని రైస్ మిల్లు ఆవరణలో సోమవారం నిర్వహించిన మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కార్యకర్తలు గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలను, అదేవిధంగా ఇటీవల ప్రకటించిన మరిన్ని పథకాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని పథకాలు అమలు జరగడం లేదని, ఆగస్టు 15వరకు 2లక్షల వరకు రైతుకు ఏకకాలంలో రుణమాఫీ జరుగుతుందన్నారు. ఓటమి భయంతో వణికిపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. రాజ్యాంగ విలువలు తెలియక ప్రజలచే ఎన్నుకోబడిన తనను నకిలీ ఎమ్మెల్యే అనడం ఎంత వరకు సమంజసమన్నారు. సామాజిక న్యాయం చేస్తానని రాజకీయాల్లో వచ్చి ప్రజలను మోసం చేస్తూ తప్పుడు మాటలు మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను చిత్తుగా ఓడించి మల్లు రవిని ఆశీర్వదించాలన్నారు. ప్రజల మధ్య ఉంటా.. కార్యకర్తలకు అండగా ఉంటానని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్‌కు ఓ టు వేయాలని మల్లురవిని గెలిపించాలని ఆయన కోరా రు. గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పను లు జరగడం కోసం కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మల్లురవి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి అన్నారు. అనంతరం పలు పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్పీటీసీ సభ్యులు రోహిణి, సుమిత్ర, ఎంపీటీసీ సభ్యులు తిరుపతయ్య, లీలావతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ బహదూర్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, మాధవులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉస్మాన్ రవూఫ్, లక్ష్మీనారాయణ, కొండానగేష్, దేవస్వామి, లింగం, సురేందర్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, నాగసాయిలు, ఎన్.మనోహర్, ఆనంద్‌చారి, మల్లేష్‌ముదిరాజ్, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించండి



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కోడేరు, మే 6 : తెలంగాణ రాష్ట్ర రైతులను, ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో ఓడించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కోడేరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బహిరంగ సభలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఎన్నికల ఇన్‌చార్జి మాజీ స్పోర్ట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధు ఎకరాకు 15వేలు, కౌలు రైతులకు 15వేలు, వ్యవసాయ కూలీలకు 12వేలు ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారని రైతులకు వరికి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇస్తామని మొండిచేయి చూపించారని ఇక అవ్వ తాతలకు 4వేల పింఛన్ ఇస్తామని మోసం చేశారన్నారు. పేద ఇంటి ఆడబిడ్డలకు పెళ్లికి లక్షతోపాటు ఒక తులం బంగారం ఇస్తానని ఇంత వరకు ఏ ఒక్కరికి ఇవ్వలేదన్నారు. ఇలా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు డ్యాన్స్‌లు చేస్తూ బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలంటూ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, సీనియర్ నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, మండల పరిధిలోని జనుంపల్లి, తీగలపల్లి, బావాయిపల్లి, ఎత్తం, ముత్తిరెడ్డిపల్లి, సింగాయిపల్లి, రాజాపూర్ తదితర గ్రామాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఉమామహేశ్వరం ప్రాజెక్టు పాపం గువ్వల బాలరాజుదే'

బల్మూరు, మే 6 : ఉమామహేశ్వర రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి నాటి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాపమే అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం అనంతవరం గ్రామంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుతో కలిసి అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఈ ప్రాంత ప్రజలకు నీరు అందుతుందని తీసుకున్న నిర్ణయంలో భాగంగానే మైలారం, అనంతవరం, బల్మూరు గ్రామాల రైతులు, వ్యవసాయ పొలాలను కోల్పోవాల్సి వచ్చిందని ఆయన అన్నారు. నాడు ప్రాజెక్టు కాకుండా కాల్వల ద్వారా సాగునీరు తెచ్చేందుకు కృషి చేసి ఉంటే నేడు ఈ తిప్పలు ఉండేది కాదన్నారు. పీసీసీ వైస్ ప్రెసిడెంట్ నర్సింగరావు, కిసాన్ సెల్ నాయకుడు ఖదీర్, యువ నాయకులు శ్రీనివాసులు, మశన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాకర్‌గౌడ్, బలరాంనాయక్, సలేశ్వరం, వెంకటస్వామి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

కొల్లాపూర్, మే 6 : కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కొల్లాపూర్ బీజేపీ మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సింగోటం గ్రామ నాయకులు సాయి బాబాగౌడ్, ధర్మాచారి, శివకుమార్‌యాదవ్, కుర్మయ్య కృష్ణయ్య, శివ, నవీన్, సునీల్, చరణ్, సత్యప్రకాశ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తెలకపల్లి మండల కేంద్రం పశువుల సంతలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మన బీజేపీ పార్టీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గన్నోజు నరేంద్రచారి, ప్రధాన కార్యదర్శులు బాబుసాగర్, గుండూరు రాము, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గోపాస్‌చందు, బూత్ అధ్యక్షుడు భానుగౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

అమ్రాబాద్ మే 6: అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎయిడ్స్ నిర్మూలన లో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రెడ్ రిబ్బన్ క్లబ్‌ను ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాధ ఈ సందర్భంగా వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి ఎయిడ్స్ కాని సోకితే కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సభ్యులు పాల్గొన్నారు

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే

లింగాల, మే 6: అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన మండల పరిధిలోని కోమటికుంటకు చెందిన మాజీ సర్పంచు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సి.రాంరెడ్డి కుటుంబాన్ని సోమవారం ఎంపీ రాములు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించారు. గ్రామానికి రెండుసార్లు సర్పంచుగా పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారని ఆయన అకాల మరణంతో గ్రామానికి తీరని లోటని వారు సంతాపం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

కొల్లాపూర్, మే 6 : కొల్లాపూర్ మండల పరిధిలోని కుడికిళ్ల, నార్లపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోరుతూ బీఆర్ఎస్ నేతలు సోమవారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు డీకేమాదిగ, పస్పుల రామకృష్ణ, కల్మూరి నిరంజన్‌లు మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. వెంకటస్వామి, చారకొండ శివ, కళాకర్, కుడికిళ్ల మాజీ ఎంపీటీసీ బుచ్చన్న, బి.శేఖర్, మొద్దు శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, మే 6 : తలకొండపల్లి మండలం వెల్జాల్ సమీపంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కారు ఢీకొని గాయపడి వెల్దండ సమీపంలోని యెన్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పరుశరాములు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా చికిత్స అందుతున్న తీరును డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి అక్కడికి పంపించే ఏర్పాట్లను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో నరేష్ అనే వ్యక్తి మృతిచెందడం, పరుశరాములు తీవ్రంగా గాయపడడం దురదృష్టకరమన్నారు.

మృతుని కుటుంబానికి ప్రభుత్వపరంగా 10 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రునికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, జడ్పీటీసీ సభ్యులు విజితారెడ్డి, ఉప్పల వెంకటేష్, పత్యానాయక్, వెంకటయ్య, రాములు తదితరులు ఉన్నారు.

గుండ్లగుంటపల్లిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

ఊర్కొండ, మే 6: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని గుండ్లగుంటపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండల్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.


రేపు సోమశిలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కొల్లాపూర్, మే 6 : కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో ఈ నెల 8వ తేదీన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఇన్‌చార్జి ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి నడికొట్టు శ్రీనిధి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో సోమశిల గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరయ్యే వారందరికీ చట్టాలపై అవగాహన కల్పించబడుతుందని, రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలను, హక్కులను ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలియజేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించేందుకు న్యాయమూర్తి ఎన్.శ్రీనిధి తెలిపారు.

నేడు సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశం

కొల్లాపూర్, మే 6 : కొల్లాపూర్ నియోజకవర్గ స్థాయి సీపీఐ కార్యకర్తల సమావేశం మంగళవారం పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ఎండీ.ఫయాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో భాగంగా ఇండియా కూటమి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి ఎన్నికల నేపథ్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకున్న అదనపు కలెక్టర్ సీతారామారావు



ఓటు వేసినట్లు వేలు చూపుతున్న అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 6: రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు 2024 లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తన పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో తన పోస్టల్ బ్యాలెట్ ఓటును వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసామ్య దేశంలో ఓటు హక్కుకు చాలా ప్రాధాన్యత ఉందని, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికల్లో దేశ పౌరులు ప్రతీ ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించి ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

నాగం శశిధర్‌రెడ్డి విస్తృత ప్రచారం

తెలకపల్లి, మే 6 : మండలంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు డాక్టర్ నాగం శశిధర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. గట్టురావిపాకుల, గట్టునెల్లికుదురు గ్రామాల్లో సోమవారం పనికి ఆహార పథకం కింద పని చేస్తున్న కూలీల దగ్గరికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలియజేశారు.

రాబోయే రోజుల్లో పార్లమెంట్ హక్కుల కోసం పోరాడే వ్యక్తి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, ఎంపీటీసీ లక్ష్మయ్య, సుబ్బయ్య, మండల నాయకులు మాధవరెడ్డి, సర్పంచ్ శ్రీను, సుభాష్‌గౌడ్, బాబుగౌడ్, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, నాయకులు భీమయ్య, మూలాంటి వెంకటేశ్, దామోదర్‌రెడ్డి, సత్యం, అహ్మద్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన

అమ్రాబాద్, మే 6: అమ్రాబాద్ మండల పరిధిలోని మాధవన్‌పల్లి గ్రామంలో క్రమబద్ధమైన ఓటర్స్ విద్య ఎన్నికల భాగస్వామ్యం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఈజీఎస్ ఏపీవో సీ రఘు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు అవగాహన కల్పించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని రఘు కూలీలకు సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి'

చారకొండ, మే 6: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి జరుగుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జూపల్లిలో డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, జిల్లా నాయకుడు ముస్తఫ ముజ్జుబాయి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించారని అన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో ప్రభుత్వమే ఏర్పాటు లక్ష్యంగా బీజేపీతో హోరాహోరీ జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎల్కా రాంచెంద్రి, సిరాజ్, మాలస్వామి, మల్లికార్జున్, కృష్ణయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



కొండనాగులలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ అరుణ

బల్మూరు, మే 6 : మండల పరిధిలోని కొండనాగుల, బల్మూరు గ్రామాల్లో మల్లు రవికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గడప గడపకు ప్రచారంలో భాగంగా ఎంపీపీ అరుణ, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మశన్న, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లికంటి శ్రీనివాస్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, యూత్ జనరల్ సెక్రటరీ కిరణ్‌కుమార్, గ్రామ కాంగ్రెస్ నాయకులు రామస్వామిగౌడ్, బిచ్చన్న, మహమూద్, సుభాష్, కొండల్, గుయం వెంకటేశ్, కోరే రమేష్, ఇమ్మడి విష్ణు, యాదగిరి, అంజి, సాకలి మల్లేష్, జహంగీర్‌జీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

వెల్దండ, మే 6 : సింగిల్‌విండో ద్వారా రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్‌రావు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎరువుల సరఫరా చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని భాస్కర్‌రావు తెలిపారు. మేనేజర్ రఘునందన్‌రెడ్డి, సూపర్‌వైజర్ గోపాల్‌రెడ్డి, సీఈవో శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.